సాక్షి నిర్మల్

గురువారం । 12 । డిసెంబర్ । 2024



తాకట్టులో పట్టాపుస్తకం!

సహకార బ్యాంక్‌లలో పంట రుణాల కోసం పట్టాపుస్తకం తాకట్టు పెట్టాలని అధికారులు కొత్త నిబంధనలు విధించారు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. 8లో▸

యజ్ఞశాల ప్రారంభం



కుంటాల: కల్లూరు సాయి బాబా ఆలయంలో నిజామాబాద్‌కు చెందిన సోదరులు పొల్దె సంతోష్, శ్రీనివాస్ వారి తండ్రి దేవేందర్ గుప్తా జ్ఞాపకార్థం యజ్ఞశాల నిర్మించారు. బుధవారం ప్రారంభించారు.

గరిష్ఠం/కనిష్ఠం
27.0 / 14.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా, అప్పుడప్పుడు పూర్తిగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న వీసీ గోవర్ధన్

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ పీయూసీ విద్యార్థిని కాటేపల్లి మీనాక్షి ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. 2023–24 ఎల్‌ఐసీ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ పథకానికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ స్కాలర్‌షిప్ కింద ఇంజినీరింగ్ చదివేకాలానికి ఏటా రూ.15వేలు అందుతాయని తెలిపారు. స్కాలర్‌షిప్‌లో భాగంగా టాటా గ్రూప్ ఏటా రూ.12వేల ఆర్థికసాయం అందజేస్తోందని పేర్కొన్నారు. బుధవారం మీనాక్షిని వీసీ అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ విఠల్, డాక్టర్ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

చందాలతో రోడ్డేసుకున్నారు



గ్రామస్తులు వేసుకున్న మొరం రోడ్డు

భైంసారూరల్: భైంసా పట్టణానికి ఆనుకుని ఉన్న కథ్‌గాం గ్రామస్తులు గుంతల రహదారి కారణంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారి మరమ్మతు కోసం అధికారులకు విన్నవించినా వారు స్పందించలేదు. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డంతా బురదగా మారి దారుణంగా తయారైంది. దీంతో గ్రామస్తులే రోడ్డు మరమ్మతుకు నడుం బిగించారు. రూ.1.50లక్షల చందాలు వేసుకుని రోడ్డుపై మొరం వేశారు. గుంతలు పూడ్చి చదునుచేశారు.

పసికందు కోసం రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆర్‌ఎస్సై రాజశేఖర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రిలో మంగళవారం అర్ధరాత్రి ఓ మహిళ పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. అత్యవసరంగా ఆ పసికందుకు ఏ నెగెటివ్ ప్లేట్‌లెట్ల అవసరం ఏర్పడింది. కుటుంబ సభ్యులు అందరికీ సమాచారం అందించగా.. విషయం తెలుసుకున్న ఆర్‌ఎస్సై రాజశేఖర్ ఆస్పత్రికి వచ్చి రక్తదానం చేసి పసికందు ప్రాణాలు కాపాడారు. కుటుంబ సభ్యులు ఆర్‌ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.

గణిత పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని శ్వేత

భైంసాటౌన్: తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి గణిత ప్రతిభ పాటవ పోటీల్లో భైంసా విద్యార్థిని ప్రతిభ కనబర్చింది. పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని పీ శ్వేత మూడో బహుమతి పొందినట్లు ప్రిన్సిపాల్ సుమలత తెలిపారు. ఈనెల 18న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. బుధవారం విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

నాణ్యతకే కమిటీలు

- నిబంధనలతో మధ్యాహ్న భోజనం
- పరిశీలన, తనిఖీకి ప్రత్యేక కమిటీలు
- స్కూళ్లలో నియామకానికి ఆదేశం
- ఇక విద్యార్థులకు నాణ్యమైన ఆహారం



బాసర మండలం బిద్రెల్లి పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న విద్యాశాఖ కమిషనర్ (ఫైల్)

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో భోజనంలో నాణ్యత లోపాల కారణంగా విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ చేపట్టింది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు నిర్ణయించింది. ఇందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఆహార కమిటీలను నియమించాలని ఆదేశాలు జారీ చేసింది. కమిటీలో ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్, ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ప్రతీరోజు వారు భోజనం చేశాక విద్యార్థులకు వడ్డించాలనే నిబంధన విధించారు. తద్వారా భోజనంలో నాణ్యత పెరుగుతుందని.. లోపాలుంటే సరిదిద్దే అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు.

నాణ్యత లేకుంటే వెనక్కి..

ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో కలిపి ముగ్గురితో కూడిన ఆహార కమిటీల నియామక ప్రక్రియ చివరి దశకు చేరింది. వీరు మధ్యాహ్న భోజనానికి వినియోగించే సరుకుల పరిశీలనలో కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. బియ్యంతోపాటు ఇతర వంట సామగ్రిని ఏజెన్సీ నిర్వాహకులు ఇష్టానుసారంగా తీసుకురాకుండా పర్యవేక్షించాలి. సరుకుల్లో నాణ్యత ఉంటేనే అనుమతించాలని, లేకుంటే తిప్పి పంపాలని స్పష్టమైన ఆదేశాలు అందాయి. అంతేకాకుండా మధ్యాహ్న భోజనం తయారీకి వాడుతున్న బియ్యంతో పాటు కారం, అల్లం, వెల్లుల్లి, కూరగాయలు, నూనె తదితర సామగ్రి నాణ్యతగా ఉందా, లేదా అని కూడా పరిశీలించాలి. ఆపై వంట చేసే ప్రదేశం శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. కాగా, ప్రతిరోజూ వంట చేసే సమయంలో ఫొటోలు తీసి విద్యాశాఖ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆపై కమిటీ సభ్యులు భోజనం చేసి అంతా బాగుందని నిర్ధారించుకున్నాకే విద్యార్థులకు వడ్డించాలి. ఈ కమిటీలను ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీలు, గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో వెంటనే నియమించాలని అధికారులు సూచించారు. ఈ కమిటీతో పాటు మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులూ నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రతీ బుధవారం విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

నిధులు పెంచితేనే ఫలితం

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఎన్నో ఏళ్లుగా ధరలు పెరగడం లేదు. ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యార్థులకు చాలీచాలని నిధులతో అరకొరగా భోజనం వండి పెడుతున్నారు. పైగా నెలల తరబడి బకాయిలు చెల్లింపులకు నోచుకోక ఏజెన్సీ నిర్వాహకులు వంట తయారీలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. నిధులు పెంచితేనే పిల్లలకు నాణ్యమైన భోజనం అందించే వీలుంటుంది.

కమిటీల బాధ్యతలివే..

- ప్రతీరోజు వంట గదులను పరిశీలించాలి. నాణ్యమైన కూరగాయలు వస్తున్నాయా.. లేదా.. అని తనిఖీ చేయాలి.
- వంటకు ఉపయోగించే ఇతర దినుసులు కూడా నాణ్యమైనవేనా.. ఉపయోగానికి గడువు ఉందా.. అని పరిశీలించాలి.
- ఉపాధ్యాయులు తిన్న తర్వాతే విద్యార్థులకు భోజనం వడ్డించాలి.
- టీచర్లు భోజనం చేశాక రుచిపై అభిప్రాయాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి.
- రుచి బాగుందా.. లేదా.. అనే విషయంపై విద్యార్థుల అభిప్రాయాలు తీసుకుని రిజిస్టర్‌లో సంతకాలు చేయించాలి.
- వంటలను పాఠశాలలోనే చేయించాలి. ఏజెన్సీ బాధ్యులు ఇంటి వద్ద వండుకుని తీసుకువస్తే నిరాకరించాలి.
- ఏజెన్సీ నిర్వాహకులు శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలి.
- పాఠశాలలోని వంట గది, కార్యాలయంలో మెనూ చార్ట్ ఏర్పాటు చేయాలి.
- ఆహార కమిటీ బాధ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు చార్ట్‌లో నమోదు చేయాలి.

నాణ్యత పెంచేందుకే..



విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు కలెక్టర్ ఆదేశాలతో పకడ్బందీ చర్యలు చేపట్టాం. అన్ని పాఠశాలల్లో ఆహార కమిటీల నియామకానికి చర్యలు తీసుకున్నాం. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వంట సిబ్బందికి సూచించాం. ఎంఈవోలు తరచూ పాఠశాలలను సందర్శించి భోజనాన్ని తనిఖీ చేస్తారు.
– రామారావ్, డీఈవో

‘ఇందిరమ్మ’ దరఖాస్తులపై సర్వే చేయాలి



వీసీలో పాల్గొన్న జిల్లా అధికారులు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

నిర్మల్‌చైన్‌గేట్: ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాలు ఈ నెలాఖరులోపు సేకరించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం సచివాలయం నుంచి సీఎస్ శాంతి కుమారి, ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్ రెడ్డి, టీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం, రాష్ట్ర ఉన్నతాధికారులతో మంత్రి ఇందిరమ్మ ఇండ్లు, గ్రూప్–2 పరీక్షల నిర్వహణ, నూతన డైట్ మెనూ పెంపు ప్రారంభోత్సవం కార్యక్రమం, సంక్షేమ వసతిగృహాల తనిఖీ తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ.. ప్రతీ 500 దరఖాస్తుల సర్వే కోసం ఒక సర్వేయర్, అవసరమైన సిబ్బందిని గుర్తించి రెండురోజుల్లో శిక్షణ పూర్తి చేయాలని సూచించారు. గ్రూప్–2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,92,233 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రానున్న 20రోజుల్లో పూర్తిస్థాయిలో సర్వే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 8,080 మంది అభ్యర్థులు గ్రూప్–2 పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. 24 పరీక్షాకేంద్రాలను సిద్ధం చేశామని చెప్పారు. సీఎస్‌లు, సంబంధిత అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎస్పీ జానకీ షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఆర్డీవో రత్నకళ్యాణి, సీపీవో జీవరత్నం, జెడ్పీ సీఈవో గోవింద్, డీఈవో పీ రామారావు, డీపీవో శ్రీనివాస్, సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, రాజేశ్వర్‌గౌడ్, మోహన్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, రీజినల్ కోఆర్డినేటర్ పీజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘గ్రూప్–2’ సజావుగా నిర్వహించాలి

నిర్మల్‌చైన్‌గేట్: గ్రూప్–2 పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్–2 పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, లోకల్ రూట్ ఆఫీసర్లు, జాయింట్ రూట్ ఆఫీసర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గ్రూప్–2 పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ నెల 15, 16తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్–2 పరీక్షలకు జిల్లాలో 8,080 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లా కేంద్రంలో 24 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తాగునీటి వసతి కల్పించాలని, వైద్య సిబ్బందిని నియమించాలని సూచించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్ పీజీ రెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, రూట్ అధికారులు పాల్గొన్నారు.

గణిత సామర్థ్యాల గుర్తింపునకే పరీక్షలు



సర్టిఫికెట్లతో విజేతలు

నిర్మల్ రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న గణిత సామర్థ్యాలు, నైపుణ్యాలను వెలికితీసేందుకే వివిధ ప్రతిభ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా పరీక్షల అధికారి సిద్ధ పద్మ తెలిపారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ గణిత ఫోరం (టీఎంఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని దీక్ష కళాశాలలో జిల్లాస్థాయి గణిత ప్రతిభ పోటీలను బుధవారం నిర్వహించారు. వివిధ మండలాల్లో గెలుపొందిన పదో తరగతి విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. తెలుగు మీడియంలో ఆర్.సరిత, (జెడ్పీహెచ్‌ఎస్ కిసాన్‌గల్లి భైంసా) ప్రథమ, మానస (జెడ్పీహెచ్‌ఎస్ మున్యాల్) ద్వితీయ, యు.నితీష (జెడ్పీహెచ్‌ఎస్ తిమ్మాపూర్) తృతీయ, ఇంగ్లిష్ మీడియంలో రోహిత్‌కుమార్ (జెడ్పీహెచ్‌ఎస్ మస్కాపూర్) ప్రథమ, ఎన్.శతిక (జెడ్పీహెచ్‌ఎస్ వడ్యాల్) ద్వితీయ, హర్షవర్ధన్ (జెడ్పీహెచ్‌ఎస్ మస్కాపూర్) తృతీయ, రెసిడెన్షియల్ విభాగంలో ఎ.సాహిత్య (సోఫీనగర్ పాఠశాల) ప్రథమ, ఎం.సుష్మిత ద్వితీయ, పీ శ్వేత (భైంసా పాఠశాల) తృతీయ బహుమతులు సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో టీఎంఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చట్ల శ్రీనివాస్, మనోహర్ రెడ్డి, కోశాధికారి రమాదేవి, సెక్టోరియల్ అధికారి ప్రవీణ్‌కుమార్, దీక్ష కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, ప్రమోద్‌రావు, ఉపాధ్యాయులు రవికాంత్, అశోక్, గోపాల్‌రెడ్డి, సాయినాథ్, శేఖర్‌వర్మ, రవి, మమత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజుకు వెంకటేశ్ దీక్ష



వెంకటేశ్‌కు మద్దతు తెలుపుతున్న సుదర్శన్

కుంటాల: మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరుతూ మిషన్ కుంటాల చైర్మన్ దొనికెన వెంకటేశ్ చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం మూడోరోజుకు చేరింది. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ దీక్ష శిబిరాన్ని సందర్శించి వెంకటేశ్‌కు మద్దతు తెలిపారు. తక్షణమే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఓయూ జేఏసీ నాయకులు, ఫౌండేషన్ సెక్రటరీ యోగేశ్, సీఈవో అనిల్‌కుమార్, బరుకుంట ప్రవీణ్, భువ లక్ష్మణ్, రాజు, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంపు ఎప్పుడో!

- నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- ఆశతో నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

జిల్లాలో ఆసరా పింఛన్ల వివరాలు

మొత్తం పెన్షన్లు	1,37,840
వృద్ధులు	27,597
వితంతువులు	35,587
దివ్యాంగులు	9,626
గీత కార్మికులు	267
నేత కార్మికులు	43
ఒంటరి మహిళలు	2,107
బీడీ కార్మికులు	62,389
పైలేరియా బాధితులు	49



నిర్మల్‌చైన్‌గేట్: అధికారంలోకి వచ్చిన వెంటనే వివిధ వర్గాలకు ఇస్తున్న పింఛన్ మొత్తాన్ని రూ.2,016 నుంచి రూ.5వేలకు పెంచుతామని కాంగ్రెస్ గత శాసనసభ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. దివ్యాంగులకు రూ.6వేలు ఇస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇప్పటివరకు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వరుస ఎన్నికలు రావడంతోనే కొంత ఆలస్యం జరిగినట్లు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

లబ్ధిదారుల ఎదురుచూపు

పింఛన్ల పెంపుపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత ఫిబ్రవరిలో జరిగిన శాసనసభ సమావేశాల్లోనూ పింఛన్ల పెంపుపై బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు, ప్రతిపాదనలు చేయలేదు. పింఛన్ల పెంపుపై మార్గదర్శకాలూ విడుదల కాకపోవడంతో పెంపు ఇప్పట్లో ఉంటుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతి కింద 200 యూనిట్లు ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ కింద రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్ల పథకాలపైనే ఎక్కువగా దృష్టి సారించింది. పింఛన్ల పెంపుపై అంతగా దృష్టి పెట్టినట్లు కనిపించడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లు పెంచాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు, లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

వెంటనే పెంచాలి



ప్రభుత్వం పింఛన్ ఎప్పుడు పెంచుతుందోనని ఆశగా ఎదురుచూస్తున్న. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా పింఛన్ పెంచితే కొంత ఆసరాగా ఉంటుంది. ప్రభుత్వం వెంటనే పింఛన్ మొత్తాన్ని పెంచాలి.
– ఎస్.లింగమ్మ, నిర్మల్

హామీలు అమలు చేయాలి



కాంగ్రెస్ గత శాసనసభ ఎన్నికల్లో పింఛన్ మొత్తాన్ని పెంచుతామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతోంది. ఇంకా పింఛన్ల పెంపుపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. వెంటనే పింఛన్ పెంచి ఇవ్వాలి.
– కోరిపెల్లి శ్రావణ్‌రెడ్డి

వేసవిలో ‘ప్రాణహిత’!

- డా.బీఆర్ అంబేడ్కర్ ప్రాజెక్టుకు సర్కారు పచ్చజెండా
- రానున్న ఎండాకాలంలో పనులు ప్రారంభించే అవకాశం
- నీటి పారుదలశాఖ మంత్రి ప్రకటనతో ఆశలు
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతులు

‘కాళేశ్వరం’ ప్రాజెక్టుతో ఉనికిని కోల్పోయిన ప్రాణహిత– చేవేళ్ల ప్రాజెక్టు మళ్లీ జీవం పోసుకోనుంది. ప్రాణహిత ప్రాజెక్టును నిర్మించేందుకు కాంగ్రెస్ సర్కారు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చుట్టూ అపారమైన నీటి వనరులున్నాయి. పెన్‌గంగ, వార్ధా, వెన్‌గంగ, ప్రాణహిత, గోదావరి నదుల నీరు పొలాలకు చేరడం లేదు. ఈ నేపథ్యంలో ప్రాణహిత ప్రాజెక్టుపై రైతులు కోటి ఆశలు పెట్టుకున్నారు.



కౌటాల(సిర్పూర్): ఉమ్మడి రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగు నీరందించాలనే ఉద్దేశంతో కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద 2008 డిసెంబర్ 16న ప్రాణహిత ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మొదలుకుని ఏడు ఉమ్మడి జిల్లాల్లో 16.40 లక్షల ఎకరాలకు సాగు నీటిని పారించాలనేది లక్ష్యం. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావం తర్వాత పాలకులు పదేళ్లుగా ప్రాణహిత ప్రాజెక్టును పట్టించుకోలేదు. గత ప్రభుత్వం తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత తక్కువ ఉందని, ఈ ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించింది. ఈ తరుణంలో ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం కలగానే మిగిలిపోతుందని ఆందోళనలు మొదలయ్యాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టును మళ్లీ తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాలని నిర్ణయించింది.

బడ్జెట్‌లో నిధులు..

కౌటాల మండలం తుమ్మిడిహెట్టి ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టు డిజైన్లు, అంచనాలను సవరించి రానున్న వేసవిలో శంకుస్థాపన చేస్తామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మించే అంశాన్ని పునఃపరిశీలిస్తున్నారు. నిపుణుల సలహా మేరకు ముందుకు వెళ్లనున్నారు. గత డిజైన్లు, నీటి లభ్యతను సమీక్షించి బరాజ్‌ను తప్పనిసరిగా కడతామని రాష్ట్ర మంత్రి స్పష్టం చేశారు. రానున్న రెండు, మూడు నెలల్లో ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణంపై స్పష్టత రానుంది. రాష్ట్ర ప్రభుత్వం గత బడ్జెట్‌లో ప్రాణహిత– చేవెళ్ల ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూ.248.99 కోట్ల నిధులు కేటాయించింది. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రాజెక్టు నిర్మాణంపై చర్చ జరగనుంది.

వార్ధానా.. తుమ్మిడిహెట్టినా..?

ప్రాణహిత– చేవేళ్ల ఎత్తిపోతల పథకంలో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీకి 2008లో రూ.38,500 కోట్ల అంచనా వ్యయంతో శ్రీకారం చుట్టారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణాంతరం ప్రత్యేక రాష్ట్రంలో ప్రధాన బ్యారేజీని తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డ వద్దకు మార్చడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు అందించాలన్న లక్ష్యం నెరవేరలేదు. తుమ్మిడిహెట్టికి బదులు ప్రత్యామ్నాయంగా సమీప వార్ధా నదిపై బ్యారేజీ నిర్మించాలని గత ప్రభుత్వం 2022లో నిర్ణయించింది. రూ.4,470.76 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలన అనుమతులు మంజూరైనా పనులు మొదలవ్వలేదు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాణహిత ప్రాజెక్టులో భాగంగా 70 కిలో మీటర్ల పొడవు కాలువల తవ్వకాలు పూర్తిచేశారు. ప్రస్తుతం వార్ధాపై ప్రాజెక్టు నిర్మిస్తారా.. ప్రాణహిత నదిపై బ్యారేజీ నిర్మిస్తారనే అనే చర్చ రైతుల్లో సాగుతోంది. ఎక్కడ బ్యారేజీ నిర్మించినా పనులు ప్రారంభించి పూర్తిచేయాలని అన్నదాతలు కోరుతున్నారు.



గతంలో ప్రాజెక్టు కోసం తవ్విన కాలువ

కేంద్రం నుంచి నిధులు తెస్తాం



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణానికి ముందుకొస్తే కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉంది. ఈ విషయాన్ని గత అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టంగా వివరించా. రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ పూర్తి చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించడం లేదు. తుమ్మిడిహెట్టి వద్ద కడతారా? వార్ధా నదిపై కడతారా అనే దానిపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత లేదు. ఈ ప్రాంతాల్లో ఎక్కడ ప్రాజెక్టు కట్టినా స్వాగతిస్తాం. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణ విధివిధానాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తా. రాష్ట్ర ప్రభుత్వం కాలక్షేపం చేయకుండా ప్రాణహిత ప్రాజెక్టు పనులు ప్రారంభించాలి.
– పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్యే

క్లుప్తంగా

వ్యక్తిపై కేసు నమోదు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన కొంద్ర భూమన్నపై కేసు నమోదైనట్లు ఎస్సై సుమలత తెలిపారు. కొంద్ర భూమన్న ఒరిజినల్ పాస్‌పోర్ట్ ఉన్నా కూడా పోగొట్టుకున్నానంటూ మళ్లీ కొత్త పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే విచారణలో ఆయనపై లక్ష్మణచాంద పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తేలింది. దీంతో పాస్‌పోర్ట్ అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చినందున భూమన్నపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

బెల్లంపల్లి: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదైంది. బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై కె.మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 9వ తేదీన అర్ధరాత్రి రైల్వేస్టేషన్ పెద్దనపల్లి ఏరియాలో డీజే సౌండ్‌తో ఇబ్బంది కలిగిస్తున్నారని కొంత మంది 100కు కాల్ చేశారు. దీంతో కానిస్టేబుల్ సాయికిరణ్, హోంగార్డు శివ అక్కడికి వెళ్లి డీజే సౌండ్ బంద్ చేయించగా రైల్వేస్టేషన్ ఏరియా పెద్దనపల్లికి చెందిన యాదగిరి సాయిచరణ్, చిప్పకుర్తి రాకేశ్ అనే యువకులు పోలీసు విధులకు ఆటంకం కలిగించి వాగ్వివాదం చేశారు. ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాత్కాలికంగా విగ్రహాల తొలగింపు



బాబు జగ్జీవన్‌రాం విగ్రహాన్ని తొలగిస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న శివాజీ, బాబుజగ్జీవన్‌రాం విగ్రహాలను బుధవారం తాత్కాలికంగా తొలగించారు. మండల కేంద్రంలో డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా విగ్రహాలను అధికారుల సూచన మేరకు ఆయా కుల సంఘాల నాయకులు తొలగించారు. రోడ్డు పనులు పూర్తయిన తర్వాత విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేయనున్నారు. శివాజీ విగ్రహాన్ని అడేగామ బిలో, బాబుజగ్జీవన్‌రాం విగ్రహాన్ని మండల పరిషత్తు కార్యాలయానికి తరలించి భద్రపరిచారు. దీంతో శివాజీ చౌక్‌లో ఏర్పాటు చేయనున్న బ్రిడ్జి పనులకు మార్గం సుగమమైంది.


పాన్‌కార్డును ఆపరేటివ్‌గా మార్చుకోవాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పలువురు ఉద్యోగులు తమ పాన్‌కార్డును ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోకపోవడం వల్ల వారి పాన్ ఇన్‌ఆపరేటివ్‌గా పరిగణించి వారికి ఐటీశాఖ అపరాధ రుసుము విధించిందని యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. అపరాధ రుసుమును డిసెంబర్ 31లోగా రివైజ్డ్ రిటర్న్స్, బిలేటెడ్ రిటర్న్స్ ఫైల్ చేసుకుంటే వారి అర్హత ఆధారంగా ఐటీ శాఖ టాక్స్ రీఫండ్ క్లెయిమ్ చేస్తుందన్నారు. పాన్‌కార్డును ఆపరేటివ్ పాన్‌కార్డుగా మార్చుకోవాలని సూచించింది.

తాకట్టులో పట్టాపుస్తకం!



చెన్నూర్‌లోని సహకార బ్యాంక్



- భూమి పాస్‌బుక్కులు తీసుకుని రుణాలు మంజూరు
- కొత్త నిబంధనలంటున్న సహకార బ్యాంక్ అధికారులు
- పంటల విక్రయానికి ఇబ్బందులు పడుతున్న రైతులు

చెన్నూర్: జిల్లాలోని సహకారబ్యాంక్‌లలో వ్యవసాయ రుణాలు పొందాలంటే రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. పాసుపుస్తకాలు బ్యాంకులో ఉండడంతో చేతికొచ్చిన పంటను అమ్ముకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. చిన్న, సన్నకారు రైతులకు భూవిస్తీర్ణం ఆధారంగా పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్‌లు తీసుకొని రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం గతంలో ఆదేశాలు జారీ చేసింది. దీంతో బ్యాంకర్లు రుణాల మంజూరుకు జిరాక్స్‌లు తీసుకుని రుణాలు ఇచ్చేవారు. కానీ నాలుగేళ్ల నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కొత్త నిబంధనలతో ఇబ్బందులు..

కొత్త నిబంధనల మేరకు సహకార బ్యాంక్‌లలో పాసుపుస్తకాలు పెట్టుకుని రుణాలు మంజూరు చేస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుల వద్ద పట్టాదారు పుస్తకాలు లేకపోవడంతో పండించిన పంటను విక్రయించేందుకు తిప్పలు తప్పడం లేదు. పత్తి విక్రయించాలంటే సీసీఐ అధికారులు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్‌లను అడుగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్‌ల కోసం బ్యాంక్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 42 బ్యాంకులు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 42 సహకార బ్యాంక్‌లు ఉన్నాయి. ఈ బ్యాంక్‌లలో సుమారు 15 వేల మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పెట్టుకుని అధికారులు రుణాలు మంజూరు చేశారు. ఐదేళ్ల క్రితం వరకు పట్టాదారు పుస్తకాలు లేకుండానే సహకార బ్యాంక్‌లో రుణాలు అందజేశారు. కానీ ప్రస్తుతం కొత్త నిబంధనల మేరకు రుణాలు ఇస్తుండడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. పాత రైతులకు పట్టా పుస్తకాలు లేకుండానే రెన్యూవల్ చేసి రుణాలు ఇస్తున్నారు. కానీ నాలుగేళ్ల క్రితం నుంచి రుణాలు తీసుకుంటున్న రైతుల వద్ద నుంచి పాసుపుస్తకాలు తీసుకుంటున్నారు.

నిబంధనల మేరకే..

కొత్తగా రుణాలు పొందే రైతుల పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకొని రుణాలు ఇవ్వాలని ఉన్నతాధికారులు సర్క్యులర్ జారీ చేశారు. ఆ మేరకే రుణాలు ఇస్తున్నాం. రైతులకు జిరాక్స్‌లు తీసుకునేందుకు అవసరముంటే వారికి పాసుపుస్తకాలు అందజేస్తున్నాం.
– సరిత, సహకార బ్యాంక్ మేనేజర్, చెన్నూర్

పత్తి విక్రయానికి తిప్పలు



పత్తి అమ్ముకోవాలంటే సీసీఐ అధికారులు పట్టాదారు పుస్తకం జిరాక్స్ కావాలంటున్నారు. సహకార బ్యాంక్‌లో రుణం తీసుకున్న. నా పట్టాదారు పుస్తకం బ్యాంక్‌లో ఉంది. దీని కోసం బ్యాంక్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న. పాత నిబంధనల ప్రకారం పట్టాదారు పుస్తకం లేకుండా రుణాలు ఇవ్వాలి.
– తడకల మహేశ్, రైతు, చెన్నూర్

తాకట్టు పెడుతున్నాం..



సహకార బ్యాంక్‌లో రుణం పొందాలంటే రైతు పట్టాపుస్తకం తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. బ్యాంక్ అధికారులు ఇతర బ్యాంక్‌ల నుంచి నోడ్యూస్ సర్టిఫికెట్ తీసుకుని రుణాలు ఇవ్వాలి. పాసుబక్కులు పెట్టుకుని రుణాలు ఇవ్వడం అంటే రైతులను ఇబ్బందులకు గురి చేయడమే.
– రాంగోపాల్‌రెడ్డి, రైతు, సుందరశాల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా..



పట్టాదారు పాసుబుక్కులు లేకుండా రుణాలు ఇవ్వాలని పలుమార్లు జిల్లా సమావేశంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. రైతులు ఇతర బ్యాంక్‌లలో రుణాలు తీసుకోకుండా నిబంధన పెట్టామన్నారు. నో డ్యూస్ సర్టిఫికెట్ ఆధారంగా రుణాలు ఇవ్వాలి. పత్తి రైతులు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవం. మరోసారి జిల్లా అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్తా.
– చల్లా రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, చెన్నూర్

మరదలుపై కత్తితో వదిన దాడి

- కలకలం రేపిన కుటుంబకలహాలు
- బాధితురాలి పరిస్థితి విషమం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తనుజ

ముధోల్: కుటుంబ కలహాలతో బుధవారం మరదలుపై వదిన కత్తితో దాడి చేసిన ఘటన మండలంలో కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిమాధవ్‌నగర్‌లో భైంసా మండలం బోరిగాం గ్రామానికి చెందిన హన్మంత్‌రావు అద్దెకు ఉంటున్నాడు. హన్మంత్‌రావు ముధోల్ ఎస్‌బీఐలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండు నెలల క్రితం హన్మంత్‌రావు భార్య అశ్విని ప్రసవానికి వెళ్లి భైంసా పట్టణంలోని తల్లి వద్ద ఉంటుండగా, హన్మంత్‌రావ్‌తో పాటు అతని సోదరి రీచా (తనుజ) ఉంటున్నారు. కాగా బుధవారం అశ్విని బుర్కా వేషంలో వచ్చి భర్త హన్మంత్‌రావు ఇంట్లో లేని సమయంలో తనుజపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసింది. తనుజ కేకలు వేయగా అరుపులు విన్న చుట్టుపక్కల వారు అశ్వినిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. సీఐ మల్లేశ్ అక్కడకు చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గాయాలపాలైన తనుజను 108 అంబులెన్సులో భైంసా ఏరియాసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా దాడికి పాల్పడిన అశ్వినిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ మాట్లాడుతూ కుటుంబ కలహాలతోనే అశ్విని తనుజపై కత్తితో దాడి చేసిందన్నారు. తనుజ గొంతు, చేతి మణికట్టు వద్ద కత్తిగాట్లు ఉండటం వల్ల మాట్లాడేస్థితిలో లేదని తెలిపారు. తనుజ కోలుకున్న తర్వాత తన వాంగ్మూలం సేకరించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ మల్లేశ్ పేర్కొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన ఫర్నిచర్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న ఫర్నిచర్‌తో సిబ్బంది

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్‌లోని కవ్వాల్‌లో బుధవారం అటవీశాఖ అధికారులు మూకుమ్మడి దాడులు చేసి రూ. 35 వేల విలువైన ఫర్నిచర్ పట్టుకున్నారు. రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం అక్రమ కలప నిల్వ ఉందనే సమాచారం మేరకు రేంజ్ సిబ్బందితో కలిసి గ్రామంలోని పలు ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. సోదాలలో ముస్తాక్ అనే వ్యక్తి ఇంటిలో ఫర్నిచర్ లభ్యమైంది. నిల్వకు అనుమతి లేని ఫర్నిచర్ పట్టుకుని కవ్వాల్ సెక్షన్ కార్యాలయానికి తరలించారు. పట్టుకున్న ఫర్నిచర్ విలువ రూ.35వేలు ఉంటుందని రేంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. అక్రమంగా కలప తరలించినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడులలో సెక్షన్ అధికారులు రవి, హన్మంతరావు, కృష్ణారావు, బీట్ అధికారులు ముజీబోద్దీన్, ప్రణయ్, బానయ్య, తదితరులు ఉన్నారు.

సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ గల ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం జరిగిన శాసనమండలి, శాసనసభ, కార్యవిధానం, నిర్వహణ నియామవళిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు, ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి



దెబ్బటి తిరుపతి (ఫైల్)

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై మధుర జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో దెబ్బటి తిరుపతి అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి హనుమాన్ బస్తీకి చెందిన తిరుపతి –మహేశ్వరి దంపతులు, కూతురు శ్రీవిద్య, ఆమె పిల్లలు మహశ్రీ, అచ్యుతానంద్, డ్రైవర్ హరీశ్‌లు కారులో శ్రీరాంపూర్ వెళ్లి రాత్రి తిరుగుపయణమయ్యారు. బెల్లంపల్లికి వస్తున్న క్రమంలో మహారాష్ట్ర నుంచి అతివేగంగా వచ్చిన కారు వీరి కారును ఢీకొట్టడంతో తిరుపతి అక్కడికక్కడే మృతిచెందగా మిగితా వారందరు గాయాలపాలయ్యారు. మృతుడి కుమారుడు దెబ్బటి విక్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

ప్రమాదం జరిగిన స్థలాన్ని బుధవారం బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ స్థలంలో ప్రమాదాలు అధికంగా జరుగుతుండడంతో పాటు మంగళవారం మూడు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. దీంతో నేషనల్ హైవే అధికారులను పిలిపించి స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని హైవే అధికారులు తెలపడంతో వారికి పలు సూచనలు చేశారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఇంట్లో గొడవతో వృద్ధుడి ఆత్మహత్య



బాలమల్లు మృతదేహం

దండేపల్లి: మనుమరాలి పుట్టినరోజు విషయంలో ఇంట్లో గొడవపడి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దండేపల్లి మండలం రెబ్బనపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. లక్సెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన పొన్నం బాలమల్లు (66), తన మనుమరాలి పుట్టినరోజు వేడుకల నిర్వహణపై ఈనెల 10న చర్చించే క్రమంలో, కొడుకుతో గొడవపడి ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం రాత్రి వరకు వెతికినా దొరకలేదు. బుధవారం దండేపల్లి మండలం రెబ్బనపల్లి శివారులో బాలమల్లు మృతదేహం లభ్యమైంది. అతని చొక్కాపై గుర్తుతెలియని పురుగుల మందు మరకలు కనిపించాయి. బాలమల్లు భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రేషన్ బియ్యం పట్టివేత



లక్ష్మణచాంద: వడ్యాల్‌లో నిల్వ చేసిన బియ్యం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పక్కా సమాచారంతో బుధవారం వడ్యాల్ గ్రామంలోని గంధం నర్సయ్య ఇంటిపై దాడి చేసి నిల్వ చేసిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కార్తీక్ రెడ్డి పంచనామా చేసి బియ్యాన్ని సమీపంలోని రేషన్‌షాపులో అప్పగించారు. నర్సయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుమలత తెలిపారు. ఏఎస్సై శ్రీనివాస్, పీసీలు అశోక్, సంతోష్ ఉన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని రెండోజోన్‌లో శిథిలావస్థలో ఉన్న 377 నంబర్ క్వార్టర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. తహసీల్దార్ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు 377 క్వార్టర్ వద్దకు ఆర్ఐ గణపతి సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమైంది. బియ్యాన్ని సీజ్ చేసి సమీపంలోని డీలర్‌కు అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు.

వాహనం ఢీకొట్టి నీలుగాయి మృతి



వాహనం ఢీకొనడంతో మృతిచెందిన నీలుగాయి

దిలావర్‌పూర్: మండలంలోని నిర్మల్ –భైంసా రహదారిపై సిర్గాపూర్ –న్యూలోలం గ్రామాల మధ్య కాల్వ నరసింహస్వామి ఆలయ స్వాగత తోరణం సమీపంలో బుధవారం మధ్యాహ్నం కారు ఢీకొనడంతో నీలుగాయి (మనుబోతు) మృతిచెందింది. నిర్మల్‌వైపు నుంచి భైంసా వైపునకు వెళ్తున్న కారుకు నీలుగాయి అడ్డుగా వచ్చింది. దీంతో కారు వేగంగా ఢీకొట్టడంతో నీలుగాయి మృత్యువాత పడింది. కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఎఫ్ఎస్‌వో ఫారూఖ్ అలీ, ఎఫ్‌బీవో మీనాలు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంలో మృత్యువాత పడ్డ నీలుగాయికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించి పోలీసులు సైతం కేసు వివరాలు నమోదు చేసుకున్నారు. మండల పశువైద్యాధికారి విజయ్, ఫారెస్ట్ వాచర్స్ ఆలంఖాన్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఊపిరి తీసిన అప్పులు..!

- ఆత్మహత్యకు యత్నించిన కుటుంబం మృత్యువాత
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒక్కొక్కరుగా నలుగురూ మృతి
- కాసిపేట గ్రామంలో తీవ్ర విషాదం



మృతుడు మొండయ్య



మృతురాలు శ్రీదేవి



మృతురాలు చైతన్య



మృతుడు శివప్రసాద్

తాండూర్: ఆన్‌లైన్ ట్రేడింగ్ ఆ ఇంటిల్లిపాది పాలిట మృత్యుపాశమైంది. అనతికాలంలోనే డబ్బు సంపాదించాలనే కుమారుడి అత్యాశ కుటుంబం బలవన్మరణానికి కారణమైంది. మండలంలోని కాసిపేట గ్రామానికి చెందిన సముద్రాల శివప్రసాద్ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోవడం, అప్పులు అధికం కావడం, అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం శీతల పానీయంలో గడ్డి మందు కలుపుకొని తాగిన విషయం తెలిసిందే. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంలో శివప్రసాద్(26)తోపాటు తల్లిదండ్రులు మొండయ్య (58), శ్రీదేవి(52), అక్క చైతన్య అలియాస్ చిట్టి (30) ఒక్కొక్కరుగా గంటల వ్యవధిలో నలుగురూ బుధవారం మృతిచెందారు.

యూట్యూబ్‌కు ఆకర్శితుడై..

శివప్రసాద్ బెల్లంపల్లిలో కొంతకాలం ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేశాడు. గత ఏడాదిన్నర కాలంగా యూట్యూబ్ ద్వారా ఆన్‌లైన్ ట్రేడింగ్ వైపు ఆకర్శితుడయ్యాడు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాడు. తొలుత కాస్త లాభాలు ఆర్జించాడు. ఆ తర్వాత వరుసగా నష్టాలు రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాడు. తెలిసిన వారి వద్ద అప్పులు చేయడంతో వడ్డీలు పెరిగి భారమయ్యాయి.

రూ.50 లక్షలకు పైగా..

అప్పులు పెరిగిపోవడంతో ఏడాది క్రితం కొంత కాలం శివప్రసాద్ నుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడడం, స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడంతో అప్పులు రూ.50లక్షలకు పైగా పెరిగిపోయాయి. బ్యాంకు రుణాల పేరుతో మరికొంత అప్పు చేయడంతో మోయలేని భారమైంది. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరిగిపోవడంతో తీవ్ర మానసిక క్షోభకు గురయ్యాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చే దారిలేక కుటుంబంతో కలిసి ఆత్మహత్యకు యత్నించినట్లు తెలుస్తోంది.

వైకల్యం నుంచి శాశ్వత నిద్రలోకి..

చైతన్య పుట్టుకతోనే దివ్యాంగురాలు కావడంతో తల్లిదండ్రులు అల్లారుముద్దుగా పెంచారు. మరొకరి సాయం ఉంటే గానీ జీవనం సాగించలేని పరిస్థితి కావడంతో దగ్గరుండి చూసుకునేవారు. తామందరం లేకుండా కూతురు ఎలా జీవిస్తుందోనని, చివరికి ఆమె ఎవరికి భారం కాకూడదని ఆలోచించిన తల్లిదండ్రులు తమతోపాటే గడ్డిమందు తాగించి పేగుబంధాన్ని వెంట తీసుకెళ్లారు.

గ్రామంలో విషాదఛాయలు

మొండయ్య కుటుంబమంతా మృతిచెందడంతో కాసిపేట గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎవరిని కదిలించినా కన్నీళ్లే దర్శనమిచ్చాయి. మొండయ్య చిరు వ్యాపారంతోపాటు ఇంటింటికీ తిరిగి పాల ప్యాకెట్లు విక్రయించడంతో అందరికీ సుపరిచితుడయ్యాడు. అందరితో కలిసిమెలిసి ఉండడంతో గ్రామమంతా శోకసంద్రంలో మునిగింది. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం నేరుగా కాసిపేట శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు చేయాలని బంధువులు నిర్ణయించారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో మృతదేహాలకు తాండూర్ సీఐ కుమారస్వామి, ఎస్సై కిరణ్‌కుమార్ పంచనామా నిర్వహించారు. కాగా, మృతుడు శివ ప్రసాద్ మేనమామ కోలేటి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకే చితిపై భార్యాభర్తలు..

కాసిపేట శ్మశానవాటిక సమీపంలోని మల్లన్న గుడి వద్ద బోనాల నేపథ్యంలో అక్కడ మృతదేహాలను దహనం చేసేందుకు గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. దీంతో రేచిని రైల్వేస్టేషన్ సమీపంలో దహన సంస్కారాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే సమీపంలో ఉండే వారు అభ్యంతరం తెలపడంతో అక్కడికి కొద్దిదూరంలో అర్ధరాత్రి దహన సంస్కారాలు చేశారు. భార్యాభర్తలకు ఒకే చితి పేర్చగా, కూతురు, కుమారులను వేర్వేరు చితిలపై దహనం చేశారు. మొండయ్య తమ్ముడు శ్రీనివాస్ దహన సంస్కారాలు నిర్వహించారు.

యాజమాన్యంతో స్ట్రక్చర్ సమావేశం



మాట్లాడుతున్న జీఎం సూర్యనారాయణ

శ్రీరాంపూర్: సింగరేణి యాజమాన్యానికి గుర్తింపు సంఘానికి చాలా కాలం తర్వాత స్ట్రక్చర్ సమావేశాలు నిర్వహించారు. బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జీఎం ఎల్వీ సూర్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ ఎస్కే బాజీ సైదాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. గుర్తింపు సంఘం నాయకులు 10 డిమాండ్లను యాజమాన్యం ముందు పెట్టి చర్చించారు. సొంత ఇల్లు కట్టుకొని ఇంటి రుణం తీసుకున్న ఉద్యోగులకు కంపెనీ కేటాయించిన క్వార్టర్లను వాపస్ తీసుకొని వెకేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. జనరల్ మేనేజర్ కార్యాలయంలో పనిచేసే మహిళలకు రెస్ట్‌హాల్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎస్ఆర్పీ 3 గని నుంచి రాయల్ టాకీస్ వరకు ఉన్న రోడ్డుపై కంపెనీ వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. చాలా కాలంగా ఇంటి రుణం తీసుకున్న వారికి వడ్డీ చెల్లింపులు పెండింగ్ ఉన్నాయని, వెంటనే వాటిని క్లియర్ చేయాలని కోరారు. ఇతర డిమాండ్లను యజమాన్యం ముందు పెట్టి పరిష్కరించాలని కోరారు. వీటిపై తగు నిర్ణయం తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. సమావేశంలో ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవిలు, ఆనంద్ కుమార్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులు కిషన్‌రావు, కొమురయ్య, ప్రసాద్‌రెడ్డి, బద్రి బుచ్చయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ ఎంపిక పోటీలు



ఎంపిక పోటీలో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 జిల్లా క్రికెట్ టీం ఎంపిక పోటీలను బుధవారం మంచిర్యాల పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి దాదాపుగా 100 మందికి పైగా పలువురు క్రీడాకారులు హాజరు కాగా, అందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జట్టుకు ఎంపిక చేయనున్నట్లు జిల్లా సెక్రటరీ కోదాటి ప్రదీప్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సీఏ జిల్లా కోచ్ పి. ప్రదీప్, చందు, తిరుపతి, సుధీర్, రాకేశ్ పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జైలు



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కడెం: మండల కేంద్రానికి చెందిన బాసగుట్ట గంగాధర్ గతంలో గుడుంబా కేసులో పట్టుబడి బైండోవర్‌ను ఉల్లంఘించినందున 14 రో జుల పాటు రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఇటీవలే గుడుంబా తయారీ, అమ్మకం కేసుల్లో పట్టుబడిన ఏ డుగురు నిందితులను తహసీల్దార్ సుజాత ఎ దుట బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్, సిబ్బంది వె ంకటేశ్, ఇర్ఫాన్, హరీశ్, నిరోషా ఉన్నారు.